www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 1 ఏప్రిల్ 2025

5

ఏలూరు

ఇంటర్ సెకండియర్ తరగతులు నేటి నుంచే

ఉంగుటూరు : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బివి.శ్రీనివాస్ అన్నారు. నూతన విద్యా విధాన ప్రకారం తరగతులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 23 వరకూ బ్రిడ్జి కోర్సుల ద్వారా ఇంటర్మీడియట్ నూతన సిలబస్‌పై అవగాహనా తరగతులు నిర్వహించనున్నామని వెల్లడించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వారికి అనువైన కోర్సులను ఎంపిక చేసుకుని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఉంటాయన్నారు. జూన్ 1 నుంచి యథావిధిగా ఇంటర్ తరగతులు పున:ప్రారంభం కానున్నాయన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందించనుందన్నారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి 23 వరకూ మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా అమలు చేస్తున్నామన్నారు.

'సహకారం'.. సందిగ్ధం..!

సహకార సంఘాల ఎన్నికలపై వీడని ఉత్కంఠ

ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 సంఘాలు

జూన్‌తో ముగియనున్న ప్రత్యేక అధికారుల పాలన

ఎన్నికల ఏర్పాట్లపై ఎక్కడా కానరాని అడుగులు

కంప్యూటరీకరణలో అనేక సమస్యలు

8 ఏళ్లుగా ఎన్నికలు లేక కూనరిల్లుతున్న సహకార వ్యవస్థ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎనిమిదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో సహకార వ్యవస్థ కూనరిల్లుతోంది. ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాల పాలన తీసుకురావాలని జనం కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అంతా భావించినప్పటికీ ప్రత్యేక అధికారుల పాలనతోనే ముందుకు సాగుతోంది. దీంతో సహకార సంఘాల ఎన్నికలపై సందిగ్ధత ఏర్పడింది. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించింది. 2018 జనవరితో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాదిలో ఎన్నికలు ఉండటంతో అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆ పాలకవర్గాల పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2019 జులై వరకూ ఏడాదిన్నరపాటు పాలకవర్గాలు కొనసాగాయి. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా త్రిసభ్య కమిటీలను నియమించింది. ఒకరు ఛైర్మన్, ఇద్దరు సభ్యులుగా ఈ కమిటీలను ఏర్పాటు చేసింది. దీంతో దాదాపు ఎనిమిదేళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండాపోయాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. త్రిసభ్య కమిటీలను రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించింది. అదే ఏడాది డిసెంబర్‌లో సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. డిసెంబర్‌లో మరోసారి ప్రత్యేక అధికారుల పాలనను పొడిగించింది. దీంతో ఎన్నికల ప్రక్రియపై సందిగ్ధత నెలకొంది.

జూన్‌లోనైనా ఎన్నికలు నిర్వహిస్తారా..!

వచ్చే జూన్‌కు సహకార సంఘాల్లో ప్రత్యేక అధికారుల పాలన గడువు ముగుస్తోంది. ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక మళ్లీ అధికారుల పాలన పొడిగిస్తారా అనే సందేహాలు అలముకున్నాయి. అందుకు అనేక కారణాలు కన్పిస్తున్నాయి. సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకూ 50 శాతం మాత్రమే కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. కంప్యూటరీకరణ ప్రక్రియలో అనేక సమస్యల కారణంగా ముందుకు సాగని పరిస్థితి ఉంది. సహకార సంఘాల్లో నిర్వహించే అనేక లావాదేవీల అంశాలకు సంబంధించిన కాలమ్స్ సాఫ్ట్‌వేర్‌లో లేకపోవడం, సిబ్బందికి సరిగా శిక్షణ ఇవ్వకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. ఏప్రిల్ నెలాఖరుకు కంప్యూటరీకరణ పూర్తయితేనే సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుంది. జూన్‌లో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలంటే ఇప్పటి నుంచే అందుకు సంబంధించిన ముందస్తు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అటువైపుగా ఎటువంటి ప్రయత్నమూ కన్పించడం లేదు. దీంతో సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిపోయింది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సహకార సంఘాల్లో ఇచ్చే రైతునేస్తం వంటి రుణాలు ఆలస్యమవుతున్నాయని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహకార సంఘాల నుంచి డిసిసిబికి ఫైలు చేరిన తర్వాత ముందుకు కదలడం లేదంటూ రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ప్రజాప్రతినిధులు ఉంటే రైతులు నేరుగా మాట్లాడుకునే అవకాశం ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా ప్రతి సహకార సంఘానికీ 12 మంది సభ్యులు ఉంటారు. ఎస్‌టి కోటా ఉన్నచోట 13 మంది వరకూ ఉంటారు. సహకార సంఘాల ఎన్నికలు జరిగితే దాదాపు 3,500 పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే సహకార పదవులపై టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాల్సిందే.

త్యాగానికి ప్రతీక రంజాన్

నూజివీడు ఈద్గా త్వరలో మరింత అభివృద్ధి

రంజాన్ వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారధి



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. రంజాన్ సందర్భంగా ఆయన సోమవారం నూజివీడు ఈద్గాకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు ఈద్గా అభివృద్ధికి త్వరలో ప్రహరీ నిర్మించనున్నట్లు, ఫ్లోరింగ్ చేపట్టనున్నట్లు చెప్పారు. నూజివీడులోని మసీదు అభివృద్ధికి త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ వెంటనే మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మసీదు మత గురువుకు నెలసరి జీతం ప్రభుత్వం తరపున వచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మత పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంజలికి న్యాయం చేయాలి

దీపక్‌పై చర్యలు తీసుకోవాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న ఐద్వా, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో గత వారం రోజుల క్రితం సూపరింటెండెంట్ వేధిస్తున్నాడని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న మండలానికి చెందిన నల్లపు అంజలికి న్యాయం చేయాలని, ఘటనకు కారకుడైన దీపక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా నాయకురాలు ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జీలుగుమిల్లి మండలంలోని వంక వారిగూడెంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాళ్లు ముత్యాలమ్మ, సుధారాణి, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, దుర్గ, లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు సీతారామయ్య, బి.రాంబాబు, సిహెచ్.కొండలరావు,వీరసత్యం తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో...

ఏలూరులో....



నూజివీడులో...

'వక్ఫ్' సవరణను వ్యతిరేకిస్తూ నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా చేపట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక తంగెళ్లమూడి వంతెన వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ జెండా చేపట్టి నిరసన తెలిపారు. రంజాన్ నమాజ్ అనంతరం మసీదుల నుండి ర్యాలీగా బయలుదేరి వంతెన వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్‌డి.ఇస్మాయిల్ షరీఫ్, ఇలియాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా నడుచుకుంటుందన్నారు. ముస్లిం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర్లకు స్థానం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సిఎం చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపాలన్నారు. లేనిపక్షంలో కూటమిలో ఉన్న పార్టీలన్నీ ముస్లిములకు ద్రోహం చేసినట్లేనని అన్నారు.

భీమడోలు: వక్ఫ్ బిల్లుపై కేంద్ర సవరణకు నిరసనగా భీమడోలులో ముస్లింలు సోమవారం శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రంజాన్ కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నూజివీడు టౌన్: వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరులు సోమవారం చేతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో రంజాన్ సందర్భంగా ఈ నిరసన చేపట్టారు. కేంద్రం నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.



మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్

లస్కర్లకు పెండింగ్ జీతాలు జమ

600 మందికి రూ.6.50 కోట్లు విడుదల

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి డెల్టా పరిధిలో పంట కాల్వల ద్వారా సాగునీరు అందించే లస్కర్లకు ప్రభుత్వం ఉగాదిని పురస్కరించుకుని పది నెలల పెండింగ్ జీతాలను విడుదల చేసింది. లస్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ జీతాలు జమ య్యేలా చేయడంలో ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కృషి ఫలించిందని లస్కర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి డెల్టాల పరిధిలో ధవళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు ద్వారా సాగునీరు సరఫరా జరుగుతోంది. ఈ సాగునీటి సరఫరాలో లస్కర్లది కీలక పాత్ర. రెండు జిల్లాల డెల్టా పరిధిలో దాదాపు 600 మంది లస్కర్లు పని చేస్తున్నారు. లస్కర్లకు గత ప్రభుత్వం దాదాపు పది నెలల బకాయిలను పెండింగ్ పెట్టింది. లస్కర్లకు నెలకు రూ.10,500 చొప్పున జీతం చెల్లిస్తున్నారు. జీతాలు పెంచాలని లస్కర్లు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వం జీతాల పెంపును పక్కన పెట్టడమే కాకుండా సమయానికి జీతాలు కూడా ఇవ్వకపోవడంతో అప్పట్లో లస్కర్లు సిఎం, మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీనివాస్ లస్కర్ల సమస్యను మంత్రి రామానాయుడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం ఉగాది రోజున పది నెలల జీతాలకు సంబంధించి రూ.6.50 కోట్లను ఏజెన్సీకి జమ చేసింది. లస్కర్లకు పెండింగ్ జీతాల బకాయి విడుదల చేయడంతో మంత్రి రామా నాయుడుని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నేత శ్రీనివాస్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎనిమిది నెలల బకాయిలు విడుదల కావాల్సి ఉంది. త్వరలోనే అవి కూడా విడుదల చేసే అవకాశం ఉందని లస్కర్లు చెబుతున్నారు.

మా భూమికి రక్షణ కల్పించండి

పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజును కోరిన జగ్గిశెట్టిగూడెం గిరిజనులు



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తమ సాగులో ఉన్న భూమికి రక్షణ కల్పించాలని, 1/70 చట్టానికి విరుద్ధంగా కెఆర్‌పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రెడ్డిగణపవరం గిరిజనేతరునికి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడంపై సమగ్ర దర్యాప్తు జరిపించి తమకు న్యాయం చేయాలని జగ్గిశెట్టిగూడెం గిరిజనులు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును కోరారు. సోమవారం వారు ఎంఎల్‌ఎను క్యాంపు కార్యాలయంలో కలిసి తమ గోడు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు ఉనుమల సూర్యచంద్రం మాట్లాడుతూ తమ తాతల కాలం నుండి జిరాయతీ భూములను తాము సాగు చేసుకుంటున్నామని, 1999లో అప్పటి కలెక్టర్ తమకు భూమికి సంబంధించి ఆర్డర్ కూడా ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకూ తాము సాగుకుంటుంటే తాజాగా కెఆర్‌పురం ఎస్‌డిసి ఈ భూమికి ఎటువంటి సంబంధం లేని గిరిజనేతరునికి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడం దారుణమన్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనులకు అన్యాయం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందిస్తూ కచ్చితంగా ఈ సమస్యను పరిష్కరిస్తానని, గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకోబోనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, నాగార్జున, బాబురావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని వంకవారిగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉపాధి హామీ పని చేసిన కూలీలకు వేతనాలు పడక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 15 నుంచి నేటికి వేతనాలు విడుదల చేయకపోవడంతో కూలీల కుటుంబాలు అప్పుల పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు 15 రోజులకోసారి వేతనాలు ఇవ్వాలని, చట్టంలో ఉన్న దాని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కూలీలకు పని ప్రదేశాల్లో పనిముట్లు, తాగునీరు, మజ్జిగ, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని చేసిన ప్రతి కూలికీ పే స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో సుమారు రూ.50 కోట్లకుపైగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధి పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మేట్లకు పారితోషికం ఐదు రూపాయలు ఇస్తామని చెప్పిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, సహాయ కార్యదర్శి మడకం సుధారాణి, ఉడతా వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు కారం దుర్గ, ఎస్.సాయికృష్ణ, ఎ.ప్రభాకర్, పి.చంటి, టి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

నిందితులను కఠినంగా శిక్షించాలి

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రవీణ్ పగడాల మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ క్రైస్తవ సంఘాలవారు కోరారు. ఈ మేరకు మండలంలోని, పట్టణంలోని క్రైస్తవ సంఘాలవారు అశ్వారావుపేట రోడ్డులోని ఎంపిడిఒ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలు దేరి మసీదు సెంటర్‌లో మానవహారం చేసి అక్కడనుంచి బస్టాండ్ వద్దకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రవీణ్ మృతికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. దీనిలో వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు, సిపియం, సిపిఎం ఎంఎల్ నాయకులు సంఘీభావంగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వెయ్యి మంది పాల్గొన్నారు.



నూజివీడులో...

జంగారెడ్డిగూడెంలో...

నూజివీడు టౌన్ : పట్టణంలో సోమవారం క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. లోతైన విచారణ జరిపి పగడాల ప్రవీణ్ మృతికి కారణం బహిరంగంగా ప్రజలందరికీ, సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది మతం ముసుగులో, మతోన్మాద శక్తులు తప్పు దోవ పట్టిస్తూ సోషల్ మీడియా వేదికగా పెడుతున్న పోస్టుల వల్ల పగడాల ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు, సందేహాలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పాస్టర్ మృతిపై స్పష్టమైన లోతైన విచారణ ప్రభుత్వం, పోలీస్ వారు త్వరితగతిన జరిపి సత్యాన్ని ప్రజలకు, క్రైస్తవ సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్టాన్లీ ప్రభాకర్ సభ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దైవ జనులు కెటి.ప్రభాకర్, బ్రదర్ బండి శ్యామ్, బ్రదర్ రంజిత్, రాచప్రోలు జోనాథన్, సుశీల్‌రావు, నిమ్మగడ్డ చంద్ర కుమార్, జీవరత్నం, తోమంద్రు లాజరస్, సిస్టర్ ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు తేల్చాలని యర్రగుంటపల్లి సిఎస్‌ఐ పాస్టర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి యర్రగుంటపల్లి సెంటర్‌లో నిరసన తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం వేగవంతమైన దర్యాప్తు చేపట్టేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్లు సంఘ విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి : మతోన్మాదుల ఆగడాలను ప్రార్థన ఐక్యతతోనే ఎదుర్కోగలమని బైబిల్ కాలేజీ ప్రిన్సిపల్ తేరా నోబుల్ హైకోర్టు అడ్వకేట్ డేనియల్ విజయ్‌కుమార్ అన్నారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండవల్లిలో కొవ్వొత్తులతో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ప్రవీణ్ పగడాలను హత్య చేశారనడానికి అనేక ఆధారాలు ఉన్నట్లు తెలుస్తున్నాయన్నారు. ప్రవీణ్ పగడాలను హత్య చేసిన మతోన్మాదులకు సరైన శిక్ష పడే వరకు ప్రతి క్రైస్తవ విశ్వాసి నిరసన తెలియజేయాలని, తెలుగు రాష్ట్రాల్లో గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున ఉద్యమాలను చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. అనంతరం ప్రధాన సెంటర్ నుంచి స్టేషన్ రోడ్ వరకు పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి మండలానికి చెందిన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

కలిదిండి : ప్రవీణ్ పగడాల మృతిపై నిరసనగా మండలంలోని మద్దవానిగూడెం నుంచి కలిదిండి ప్రధాన సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎఫ్‌సిఐ వ్యవస్థాపకులు పాస్టర్ పీటర్ పుట్టా మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతికి సంబంధించిన అన్ని రిపోర్టులను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన సెంటర్ నుంచి స్టేట్ బ్యాంక్ సమీపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి మండల పరిధిలోని పాస్టర్స్, క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవ విశ్వాసులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా సాయిరమేష్



నియామక పత్రం అందుకుంటున్న సాయిరమేష్

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా భీమడోలు ఎవిహెచ్.గా పనిచేస్తున్న డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ ఎన్నికయ్యారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు గోవిందరాజులు ఆధ్వర్యంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎల్.అనిత పర్యవేక్షణలో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సహాయ సంచాలకులు డాక్టర్ రూపకళ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. దీనిలో అధ్యక్షులుగా డాక్టర్ సాయి రమేష్‌తో పాటు ఎవిహెచ్‌లుగా పనిచేస్తున్న డాక్టర్ పిఎన్‌విఎస్.దొర (జంగారెడ్డిగూడెం) ఉపాధ్యక్షులుగా, డాక్టర్ ఎ.వెంకటరెడ్డి(భీమవరం) కోశాధికారిగా, డాక్టర్ ప్రమీలారాణి, సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారని అసోసియేషన్ నూతన అధ్యక్షులు డాక్టర్ ఇకుర్తి సాయి రమేష్ తెలిపారు.


మురళీకృష్ణను సత్కరిస్తున్న ప్రముఖులు

మురళీకృష్ణ సేవలు ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - భీమడోలు
రాజకీయాలకు అతీతంగా గుండుగొలను గ్రామపంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన గ్రామపంచాయతీ కార్యదర్శి వి.మురళీకృష్ణ సేవలు ఇతరులకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. ఆయన సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయనను అభినందించారు. సేవలను కొనియాడుతూ గ్రామస్తులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ హయాంలో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ కాలనీగా ఏర్పడిన కాలనీ అభివృద్ధికి, అవసరమైన సౌకర్యాలు కల్పనకు ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో గ్రామస్తులకు శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసి, ఆ తరువాత నిలుపుదల చేసిన దాని నిర్వహణ బాధ్యత గ్రామపంచాయతీకి అప్పగించడంతో నాంది ఫౌండేషన్ అప్పగించకపోవడంతో దానిని స్వాధీన పరుచుకుని, గ్రామస్తులకు శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తూ పంచాయతీ ఆదాయ వనరుగా మార్చిన మురళీకృష్ణ చొరవ ఇతరులకు ఆదర్శప్రాయమన్నారు. ఇదే క్రమంలో గ్రామాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించడం, రక్షిత నీటి పథకాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు మురళీకృష్ణ కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షులు వగ్వాల భాస్కర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.


వెంకటలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

దుర్గారావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు కుటుంబాన్ని సిపిఎం జిల్లా నాయకులు సోమవారం పరామర్శించారు. దుర్గారావు కుమారుడు హేమంత్ భార్య వెంకటలక్ష్మి ఇటీవల కేన్సర్‌తో మృతి చెందింది. దశ దిన కర్మను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు పలువురు హాజరై వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, నాయకులు లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, టి.రామకృష్ణ, ఎం.నాగమణి, పి.రామకృష్ణ, జివిఎల్.నరసింహారావు, పి.మంగరాజు, సాయి, నాగేశ్వరరావు, పవన్, ఇస్మాకు, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు తహశీల్దార్‌గా రవికుమార్

నేడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు
ఉంగుటూరు తహశీల్దార్‌గా అమరావతి సెక్రటరియేట్ మెడికల్ విభాగంలో పనిచేస్తున్న పాలకుర్తి రవికుమార్ ఈ నెల ఒకటో తేదిన బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల ముందు రెగ్యులర్ తహశీల్దార్లు బదిలీలు అయ్యారు. తరువాత నుంచి పూర్తి స్థాయి తహశీల్దార్ లేక ఇన్‌ఛార్జితోనే గడుపుతున్నారు. ఈ క్రమంలో అమరావతి సెక్రటరియేట్ నుంచి రవికుమార్‌ను ఉంగుటూరుకు ఎలాట్ చేసినట్లు ఎంఎల్‌ఏ ధర్మరాజు వెల్లడించారు.

ఘనంగా చినవెంకన్న ఉగాది ఉత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల
ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పూర్వపు సాంప్రదాయ ప్రకారం ఉగాది ఉత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్వామివారు మొదట శేష వాహనంపై మేళాతాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవంగా బయలు దేరి ఉగాది మండపానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.సుధాకరరావు, నివృతరావు, ఇఇ భాస్కర్ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి, దేవస్థాన సిబ్బంది ,భక్తులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
వివాహేతర సంబంధం అందిరికీ తెలిసి గ్రామస్తులు మందలించడంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన ఎస్.రాజ్‌కుమార్ (23)కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితకు వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం అందరికీ తెలియడంతో గ్రామస్తులు రాజ్‌కుమార్‌ను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని రాచన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆ యువకుడి మరణాంతరం వివాహిత కూడా సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను రాచన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా వివాహేతర సంబంధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం గ్రామంలో తీవ్ర కలకలం రేపుతుంది. పంచనామా అనంతరం యువకుడి మృతదేహంతో బంధువులు వివాహిత ఇంటి ముందు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు ఆందోళన కారులతో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
ఒప్పందం ప్రకారం సొమ్ములను చెల్లించకపోవడంతో ఓయో ప్రతినిధులపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు ఫైర్ స్టేషన్ సమీపంలోని గ్రాండ్ ఆర్యా త్రీ స్టార్ హోటల్‌ను బొల్లి వీర రాఘవయ్య చౌదరి నిర్వహిస్తున్నారు. ఆయనతో ఓయో సంస్థ ప్రతినిధులు గ్రాండ్ ఆర్యా హోటల్లో రూములు తాము బుక్ చేస్తామని, అందుకు ఒప్పందం ప్రకారం సొమ్ములను ఇస్తామని 2024లో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం హోటల్లో ఓయో వారి వద్ద బుక్ చేసుకున్న కస్టమర్లకు గ్రాండ్ ఆర్యా హోటల్లో రూములను రాఘవయ్య చౌదరి ఇస్తున్నారు. అందుకు సంబంధించిన సొమ్ములను ఇవ్వడం లేదని ఓయో ప్రతినిధులు అయిన రవితేజ (విశాఖపట్టణం), ఉమేష్ (హైదరాబాద్), పృథ్వి (విజయవాడ), నవీన్ (విశాఖపట్టణం), సుధాకర్ (విజయవాడ)లపై చీటింగ్ కేసును సోమవారం నమోదు చేశారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఏజెన్సీ మెట్టలో అక్రమ మట్టి తవ్వకాలు

వ్యాపార కేంద్రాలుగా చెరువులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం
కొయ్యలగూడెం ప్రాంతంలో సాగునీటి చెరువులు చట్టవిరుద్ధ తవ్వకాలకు వేదికగా మారుతున్నాయి. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో అధికారిక అనుమతులు లేకుండానే జరుగుతున్న ఈ కార్యకలాపాలు స్థానిక రైతులను, ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. శ్రీరామ గట్టు చెరువు, నందనాల చెరువు వంటి ప్రాంతాలు ఈ అక్రమ వ్యాపారాలకు కేంద్ర బిందువులుగా మారాయి.

కొందరు అధికారులు ప్రజాప్రతినిధుల ఒత్తిడికి లొంగి ఈ అనధికార తవ్వకాలకు మద్దతు ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకు జెసిబిలతో లోడు చేయించి టిప్పర్ లారీలతో మట్టి రవాణా జోరుగా సాగుతోంది. కొన్ని రోజులుగా ఈ కార్యకలాపాలు సాగుతున్నాయి. సమీపంలోని పంట పొలాలు దుమ్ము, ధూళితో నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు కూడా దెబ్బ తింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. తవ్వకాలను అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు చేస్తున్నారు.

కమర్షియల్ వినియోగం కోసం చట్ట విరుద్ధ క్రయ విక్రయం

తవ్విన మట్టిని కమర్షియల్ ప్రయోజనాల కోసం లేఅవుట్ నిర్మాణాలు, ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక టిప్పర్ లారీ మట్టి ధర రూ.మూడు వేల నుంచి రూ.పది వేల వరకు ఉంటుందని, ఈ లావాదేవీల్లో అధికారులకు భారీ మొత్తంలో లంచాలు చేరుతున్నాయని స్థానికుల్లో ప్రచారం జరుగుతోంది. చెరువుల్లో నీరు తవ్వకాలకు అడ్డంకిగా మారడంతో, పంట కాలువల ద్వారా నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. ఈ చర్యల వల్ల వేసవిలో పశువులకు తాగునీరు, పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

మట్టి తవ్విన శ్రీరామగట్టు సాగర్ నీటి చెరువు

రైతులు, మత్స్యకారులపై ప్రభావం

తవ్వకాల వల్ల చెరువుల్లో ఏర్పడిన గోతుల్లో పశువులు గాయపడుతున్నాయని, నీటిని విడిచిపెట్టడం వల్ల చేపల పెంపకందారులు, మత్స్యకారులు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. చెరువులు తమ జీవనాధారమని, ఇలా అక్రమంగా తవ్వితే వేసవిలో నీరు దొరకదని, పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు ఎప్పుడు?

చట్టవిరుద్ధ తవ్వకాలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పర్యావరణం, రైతుల జీవనోపాధి దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఈ చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఈ సమస్య మరింత తీవ్రమై ప్రాంతంలో సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఈ విషయంపై ఇరిగేషన్ కార్యాలయం పిడబ్ల్యు ఎఇ భాస్కర్‌ను వివరణ కోరగా అనుమతులు లేని తవ్వకాలపై మైనింగ్ శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు. రైతులు, ప్రజలు ఎప్పుడైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు.

తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలి
శుక్ల బోయిన రాంబాబు, సిపిఎం మండల కార్యదర్శి

గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా ఇలాంటి మట్టి తవ్వకాలు విపరీతంగా జరిగాయి. మళ్లీ 2025లో కూడా ప్రభుత్వ అండతో అధికారుల చేతకాని తనన్ని ఉపయోగించుకుని చట్ట వ్యతిరేకులు రెచ్చిపోతున్నారు. సంబంధిత ఎఇ, డిఇ కూడా పలుమార్లు ఫిర్యాదులు అందినా వారి నుంచి స్పందన కరువైంది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా ప్రతినిధుల సిఫార్సులను చట్ట విరుద్ధంగా ఉంటే అనుమతులు ఇవ్వకూడదు.

ఉపాధ్యాయుడిగా మణికుమార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు చింతా ఉమామహేశ్వర మణికుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మణికుమర్ దంపతులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కెఎస్‌వి.లోవకుమారి మాట్లాడుతూ అమెరికా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, సర్వేజనా సుఖినోభవంతు హైదరాబాద్, ఆదరణాలయ నిడదవోలు వారి ద్వారా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, గురురత్న సేవానంది వంటి జాతీయ పురస్కారం పొందిన

మణికుమార్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

మణికుమార్ పాఠశాలలో పనిచేయడం విద్యార్థుల అదృష్టమని కొనియాడారు. పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎంవి.ప్రకాష్ మాట్లాడుతూ మణికుమార్ వయసుతో నిమిత్తం లేకుండా ఎప్పుడూ సహ ఉపాధ్యాయులతో పోటీపడి బోధన చేసే వారని తెలిపారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ తల్లాడి జగదీష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలకు బదిలీపై రావడంతోనే ఆటోమేటిక్ రింగింగ్ బెల్ బహూకరించి విద్యార్థులకు సమయపాలనను, క్రమశిక్షణ పాటించాలని తెలిపారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు చిలుకూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు కావాల్సిన వసతులను దృష్టిలో పెట్టుకుని ప్రధానోపాధ్యాయుని గదిలో అధికారులు కూర్చునే నిమిత్తం ఆరుగురు కూర్చునే విధంగా రెండు స్టీల్ కుర్చీల సెట్ బహూకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, పూర్వవిద్యార్థులు, పూర్వ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ
ముస్లిం సోదరుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ఎంతకైనా వెనకాడేది లేదన్నారు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని కర్బలా మైదానంలో అంజుమన్ - ఎ - ముహాఫిజుల్ ఇస్లాం ఆధ్వర్యంలో కత్తెపు వీధిలోని జామియా మస్జీద్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు ముస్లిం సంప్రదాయం ప్రకారం మతపెద్దలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్ధసారథి, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, తిరుపతన్న రాజేష్ ముస్లిం మత పెద్దలు ఎండి సులేమాన్, ఎస్కే జావేద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు మటన్ పంపిణీ

దెందులూరు : రంజాన్ సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలోని పేద ముస్లింలకు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో మటన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా మటన్ అందించారు. స్థానిక క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు అందించారు. దాదాపు 1.8 టన్నుల మటన్ పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని పేద ముస్లింలకు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు దుగ్గిరాల గ్రామంలో నిర్విరామంగా కొనసాగించారు. పెదపాడు మండలం వట్లూరులో జరిగిన మటన్ పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. ఈ సందర్భంగా మటన్ పంపిణీ కార్యక్రమం నిమిత్తం తమ గ్రామాలకు విచ్చేసిన దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు స్థానిక ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికి, ఖీర్‌ను స్వయంగా ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కి తినిపిస్తూ రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

కలిదిండి : రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకంక్షలు తెలుపుకున్నారు. మత గురువులు పండుగ ప్రాముఖ్యతను గురించి వివరించారు. తమకు తోచిన రీతిలో దానధర్మాలు చేశారు. కోట కలిదిండి పెద్ద మసీదు, చిన్న మసీదు, మిలటరీ పేట మసీదు పరిధిలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండల కేంద్రమైన టి.నరసాపురంలో ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో కలిసి ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనల్లో ఇస్లాం మత ప్రబోధకులు ముంతాజ్ అన్సారీ, హాఫీజ్ నదీమ్ రంజాన్ పండుగ ప్రత్యేకతను ముస్లింలకు వివరించారు. పేదవాడి ఆకలిని గుర్తించి ఫిత్రా, జకాత్‌లతో పేదలకు దానధర్మాలు చేయాల్సిన బాధ్యతను మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను ముస్లింల బాధ్యతలను ప్రత్యేకించి పరమత సహనాన్ని తమ సందేశంలో గుర్తు చేశారు. అనంతరం స్థానిక ఖబరస్తాన్ చేరుకుని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షేక్ అబ్బాస్, షేక్ షరీఫ్, సామాజిక కార్యకర్త యస్‌డినాసర్ పాషా, మస్తాన్,షేక్ అబూబకర్,షేక్ లాలు, సయ్యద్ మీర్ సాహెబ్ (గులాబీ), ఖాదర్, సయీద్, షేక్ కరీముల్లా, ఉస్మాన్ సాహెబ్, నవాబ్, షమ్మీకపూర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం : మండల కేంద్రంలో స్థానిక అహెలె సున్నత్ జమాతె మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా స్థలంలో భారీ సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక నమాజులు నిర్వహించారు. ఈద్గా స్థలంలో మసీదు కమిటీ శీతల పానీయాలు పంపిణీ చేశారు. అనంతరం భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అహెలె సున్నత్ జమాతె మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడారు. పోలవరం ప్రాజక్టు నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన 500 మంది ముస్లిం సోదరులు, మండలంలో ఇతర గ్రామాల నుంచి, పోలవరం నుంచి 1,500 మంది ఈద్గా ప్రాంతంలో జరిగిన నమాజు కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. గ్రామంలో వీధుల్లో ముస్లిం కుటుంబాలు ఖీర్ (పాయసాలు) పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా పోలవరం మండల ముస్లిం సోదరులకు పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ముసునూరు : మండలంలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ మత కలహాలు రూపుమాపి అన్ని మతాల వారు సోదరభావంతో స్వేచ్ఛా వాతావరణంలో జీవించాలని కోరారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ పర్వదిన కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో భీమడోలులో ఈద్గా మైదానం వద్ద, పొలసానపల్లి, అంబరుపేట, పూళ్ల, గుండుగొలను, పాతూరు, గండివారిగూడెం ఇతర ప్రాంతాల్లో మసీదుల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కుక్కునూరు : మండల కేంద్రంలో రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం పలువురు పేదలకు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మదీనా మస్జిద్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాబా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - ముదినేపల్లి
మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లను కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. మండలంలోని వడాలి, పెద కామనపూడి, చినకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి పల్లెకూ పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. ఏ గ్రామంలోనూ ప్రజలు మట్టిలో నడవకూడదనే నినాదంతో ప్రతి రోడ్డు సీసీ రోడ్డు అయ్యి ఉండాలని, రాష్ట్రంలోను, కేంద్రంలోను అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కూటమి పాలనలో సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతలపూడి
గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును వచ్చే నెల ఆరో తేదీ వరకు పొడిగించినట్లు ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు %https://aprs.apcfss.in% ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మిగిలి ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

రిమాండ్ ఖైదీ మృతదేహానికి పోస్టుమార్టం

ఏలూరు స్పోర్ట్స్ :జిల్లా జైలులో బ్యారక్‌లోని కిటికీకి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రిమాండ్ ఖైదీ గంధం శాంతకుమారి మృతదేహానికి సోమవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల బృందంచే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె తల్లి కుమారికి అప్పగించారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం గ్రామానికి చెందిన గంధం శాంతకుమారి(31) ఆమె భర్త బోసును ఆమె ప్రియుడు సొంగా గోపాలరావుతో కలిసి హతమార్చిందనే ఆరోపణపై అరెస్టై మార్చి 24న జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు ఈ నెల 29వ తేదీన ఆమె కలిశారు. ఆమె ఏమనుకుందో ఏమిటో కాని ఈ నెల 30వ తేదీ ఉదయం 7.30 గంటల సమయంలో బ్యారకలోని రిమాండ్ ఖైదీలందరూ టిఫిన్ చేయడానికి రాగా ఆమె కూడా బయటకు వచ్చి వాష్‌రూమ్ అని చెప్పి లోపలికి వెళ్లి బ్యారక్ కిటికీకి తన చున్నీతో ఉరేసుకుంది. ఇది గమనించిన జైలు సిబ్బంది ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై జైలు సూపరింటెండెంట్ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సిఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ విచారణ చేపట్టారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి ఆమె తల్లి కుమారికి అప్పగించారు.

Public Notice
In The Court Of The Principal Senior Civil Judge, Eluru, W.G.Dt
O.S.No. 72/2024
Between:
Vadlapatla Vimala Devi ...Plaintiff
And
Nunna Srilakshmi & ors ...Defendants
Whereas, the plaintiff has filed suit for recovery of the amount due under the suit mortgage, whereas the Hon`ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon`ble Court on 04-04-25 at 10-30 A.M., else the matter will be decided in your absence.
PYDI VENKATA RAJU
Eluru Advocate,
Dt. 31-03-2025 Eluru.
Cell: 98851 99811

భూసారం కోసం పచ్చిరొట్ట పైర్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి
భూసారం కోసం రైతులు పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు కొత్త హరిజనవాడలో సోమవారం గౌతమ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి నవధాన్యాల సాగు ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 రకాల విత్తన కిట్స్ 12 కేజీల పరిమాణంలో అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు అనూష, సుధాకర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు నందు
ఐ.ఎ.నెం. 209/2024
ఓ.యస్.నెం. 160/2017
Between:
జుత్తిగ త్రిమూర్తులు ...పిటిషనర్/వాది
మరియు
శ్రీ రామాలయం టెంపుల్, వాకలగరువు, రిప్రజెంటెడ్ బై ట్రస్టీ పితాని వీరన్న వగైరా ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు రెస్పాండెంట్: 10. బొంతు లక్ష్మి దుర్గ, భర్త: శ్రీను, డోర్ నెం. 2-98, కంచుస్తంభం వారి పాలెం, దొడ్డిపట్ల శివారు, యలమంచిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు పిటిషన్ మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు వారి ఫైలులో O.S.No. 160/2017 దావాలో 4వ ప్రతివాది చనిపోయినందున వారికి వారసులను చేర్పించమని పిటిషన్ దాఖలు చేయుటలో జరిగిన ఆలస్యమును మన్నించి మిమ్ములను వారసులుగా చేర్పించ గలందులకు కోరుచు పై ఐ.ఎ.నెం. 209/2024 రున పై కోర్టు వారి ఎదుట సెక్షన్ 5 లిమిటేషన్ చట్టం ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ నందు మీకు నోటీసులు ఎన్నిమార్లు పంపించినను మీరు తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నందున, పై నెంబరు గ్రంధములో మీ పై పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. సదరు గ్రంధములో మీరు **ది. 04-04-2025 తేది ఉదయం 10:30 నిIIలకు** స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనుటకు వాయిదా వేసినారు. కావున మీరు ఆ రోజున హాజరై అభ్యంతరములు తెలియజేసుకోవలెననిన్నీ లేనిచో సదరు పిటీషన్ మీ పరోక్షముగా తీర్మానించబడుని తెలియజేయడమైనది.
సరిపల్లి రామ సత్తయ్య
నర్సాపురం అడ్వకేట్,
ది. 30-03-2025 నర్సాపురం
సెల్: 98488 37555

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No. 8/2025
Between:
శిరియాల సత్యనారాయణ ...పిటిషనర్
మరియు
1) యాతం సూర్య ఆదినారాయణ స్వామి
2) శ్రీమతి శిరిగినీడి జ్యోతి
3) ది.అఫిషియల్ రిసీవర్, పశ్చిమగోదావరి జిల్లా
...రెస్పాండెంట్లు
పై నెంబరు పిటిషన్, పిటిషనర్, రెస్పాండెంట్ల పైన కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ **ది. 21-04-2025వ తేదీన** వాయిదా అయివున్నది. సదరు విషయం రెస్పాండెంట్లకు మరియు యావత్తు ప్రజానీకానికి తెలియ చేయడమైనది.
షెడ్యూల్:
పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ లో చేరిన పాలకొల్లు పట్టణం, 14వ వార్డు, కటికలవారి వీధిలో, డోర్ నెం. 35-4-6, Asst No: 1079007628, RS No: 210, గల ఖాళీస్థలం 95 గజాలు ఈ క్రింది హద్దుల మధ్య:-
తూర్పు - తోట హేమ వెంకట సత్య సూర్య పద్మశ్రీ గారి స్థలం.
పడమర - వంగా రామ్‌ప్రసాద్ మరియు మార్తి కామేశ్వరరావు గారి ఆస్థి.
ఉత్తరం - జాయింటు గోడ మరియు కంచర్ల పురుషోత్తం గారి ఆస్థి
దక్షిణం - మున్సిపల్ రోడ్
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పి.డి.యస్.వి. బాలాజీ B.Com.,B.L.
శ్రీమతి యస్. జ్యోతి
పాలకొల్లు అడ్వకేట్స్,
ది.30-3-2025 పాలకొల్లు

ప్రకటన
మహారాజశ్రీ తణుకు 2వ అదనపు Ist Class మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 79/2022 in O.S.No. 210/2022
బిట్వీన్:-
వాది:- కైలా నరేష్
And
ప్రతివాదులు :-
1) పెనుమత్స రుక్మిణీ దేవి, W/o. (లేటు) వెంకట సత్య సన్యాసి బాబా రవికుమార్ వర్మ, 43 సంII హిందు, గృహిణి, D.No.2-115, ఓడూరు గ్రామము, పెనుమంట్ర మండలం, తణుకు JCJ.
2) పెనుమత్స వెంకట రామరాజన్ వర్మ, S/o. (లేటు) వెంకట సత్య సన్యాసి బాబా రవికుమార్ వర్మ, 36 సంII హిందు, ప్రైవేటు ఉద్యోగము, D.No. 2-115, ఓడూరు గ్రామము, పెనుమంట్ర మండలం, తణుకు JCJ.
3) కలిదిండి శ్రీ సూర్య సావిత్రి సుబ్రాదేవి, W/o. రామ సత్య సునీల్, D/o. (లేటు) వెంకట సత్య సన్యాసి బాబా రవికుమార్ వర్మ, D.No. 2-115, ఓడూరు గ్రామము, పెనుమంట్ర మండలం, తణుకు JCJ.
మీలో 1వ వారు (లేటు) వెంకట సత్య సన్యాసి బాబా రవికుమార్ వర్మ గార్కి భార్యగారునూ, 2.3 వార్లు కుమారులునూ అయి ఉన్నారు. (లేటు) వెంకట సత్య సన్యాసి బాబాగారు వారి జీవిత కాలములో ది. 29-03-2019 సంIIరం తేదీన వాది వద్ద ప్రాంశరీ నోటుపై తీసుకున్న రూ.II 3,50,000/- బాకీ తీర్చకుండా చనిపోయినందున ఆయనకు వారసులు అయిన మీపై దావా ప్రోనోటు బాకీ రికవరీ నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా నందు, మరియు దావా బాకీనకు హామీగా 1వ వారి భర్త 2,3 వార్ల తండ్రి గారి ద్వారా సంక్రమించిన ఆస్తిని తొడ జప్తు చేయుచుమని కోరుచూ దాఖలు చేసిన ఐ.ఎ.నెం. 79/22 పిటిషను నందు రెస్పాండెంట్లు/ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారానూ, పోస్ట్ ద్వారాను ఎన్నిసార్లు సమన్లు, నోటీసులు పంపిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా అమలు జరుగు నిమిత్తం **ది. 04-04-2025 సంIIరం తేదీనకు** వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 నిIIలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
// BY ORDER //
వి.ఎన్. శ్రీనివాసరెడ్డి
తణుకు వాది తరుపు న్యాయవాది
తేది:31-03-2025 తణుకు
సెల్: 94410 35648